పరిష్కారం

తులసి బాలకృష్ణ

సమాంతర దూరంలో పరుగిడుతున్న నల్లత్రాచుల్లా వున్న రైలుపట్టాలమీద కాలుపెట్టి, ఒకసారి చుట్టూ చూసింది సావిత్రి. అమావాస్య రాత్రి. ఎలక్ట్రిక్ దీపస్తంభాలున్న ప్రదేశాల్లో తప్ప ఎటుచూసినా కటిక చీకటి-సావిత్రి మనసులోలాగే.

ఇనుప రైలుపట్టా కాలుకి ఐసులా తగుల్తోంది. 'రంయ్' మని చలిగాలి తెరలు తెరలుగా వచ్చి, చెంపల్ని కోస్తోంది. నెమ్మదిగా పమిట తల మీదుగా చుట్టుకుని, కొంగు పళ్ళమధ్య కరిచిపెట్టి, ఇంకొకసారి చుట్టూ చూసి, ప్రక్కనే వున్న పెద్ద కొండరాయి మీదకు నడిచి, అక్కడ కూర్చుంది.

'ఎంత ఉన్నతకుటుంబంలో పుట్టినా చదువు సంధ్యల్లేని నాలాటి ఆడది ఈ దేశంలో మగవాడి చేతిలో నరకం

అనుభవించాల్సిందే. వెధవ బానిస బ్రతుకు' అని గొణుక్కుంది. 'ఇంటి దగ్గర బయల్దేరి పదినిమిషాలయ్యింది. ఇంకో ఇరవై నిమిషాలు' అనికూడా అనుకుంది.

వెనక దిగువలో ప్రక్కప్రక్కన వున్న విశాలమైన రెండురోడ్లు కడిగిన గచ్చులా వున్నాయి. ఆ రోడ్లకి ఇరుప్రక్కలా చలనంలేకుండా నిటారుగా నిల్చున్నచెట్లు రక్షకభటుల్లా వున్నాయి. ఎడమవైపు కొద్దిదూరంలో బాగా వెలుతురు. ఆ వెనగ్గా గవర్నరు బంగళా కనిపిస్తున్నాయి. వాటికి కొంచెం కుడి ప్రక్కగా ఇళ్ళమీదనుంచి విమానాశ్రయంనుంచి వస్తున్న లైటింగు మధ్య మధ్యలో కనిపిస్తోంది. ఆ ప్రక్కగా భయంకొల్పుతున్న 'భూత్ బంగళా'లాంటి ఇల్లు. కళ్ళకెదురుగా దిగువలో చలనం లేని హుసేన్ సాగర్ చెరువు. చెరువుకు అటుప్రక్క వరసలో వున్న టాంక్ బండ్మీద ట్యూబ్లైట్ల ప్రతిబింబాలు నీట్లో వెండిస్తంభాలు వ్రేళాడుతూన్న భ్రాంతిని కలిగిస్తున్నాయి. కుడివైపుగా స్టేషన్నుంచి ఎట్టిదీపం, దానికి కొంచెం ముందునుంచి పట్టాల పొడుగునా పాకుతూ వస్తూన్న నిగనిగలు. కుడివైపునే మరింత దూరంలో కొండ మీది పాలరాతి దేవాలయం స్వర్గాధిపతి మందిరంలా కనిపిస్తోంది.

చుట్టూ చూసి, ముడుచుకూర్చుని, కళ్ళలో నీళ్ళు వత్తుకుని, మోకాళ్ళమధ్య మొహందాచుకుంది సావిత్రి.

తన పుట్టింటివాళ్ళు, చిన్నప్పుడు తన నెంత గారాబంగా పెంచినదీ, వైభవోపేతంగా జరిగిన పెళ్ళి, పెళ్ళికాక ముందు రాధాకృష్ణ తనతో చెప్పిన ప్రేమకబుర్లూ,...అన్నీ గుర్తుకు తెచ్చుకుని బాధపడింది సావిత్రి. బీదవాడయినా రాధాక్రిష్ణనే పెళ్ళాడవలసింది తను. డబ్బున్నవాడు, చదువుకున్నవాడు అని గంగాధరానికి తనను ముడిపెట్టి గొంతుకోశారు తల్లిదండ్రులు.

తలెత్తి, స్టేషన్వైపొకసారి చూసి, 'ఇంక పావుగంట' అనుకుని, మళ్ళీ మోకాళ్ళమధ్య మొహందాచుకుంది.

"ఏయ్ పిల్లా...!" —భయంకొల్పే అజమాయిషీతో తక్కువస్థాయి గొంతుతో పిలిచిన పిలుపు.

—ఉలిక్కిపడి, తలెత్తింది సావిత్రి.

పెద్ద మీసాలతో, చింతనిప్పుల్లాంటి కళ్ళతో ఎదురుగా కండలుతిరిగిన వస్తాదులాంటి మనిషి. మోకాళ్ళమీద కూర్చుని, కళ్ళు బాగా పెద్దవిచేసి, తన కళ్ళలోకి నమిలేసేలాగ చూస్తున్నాడు. ఒకక్షణంలో నిభాయించుకుంది సావిత్రి

"ఏయ్—ఎవరివయ్యా నువ్వు?" అని కసురున్నట్టుగా అంది.

—ఉలిక్కిపడి చూసాడు వాడు.

తనని చూస్తూనే గుండె ఆగి చస్తుంది అనుకున్నాడు. ఎవరికైనా కలలో కొచ్చే ఆకారం తనది. అందులో—రాత్రివేళ, ఒంటరి ఆడది. తననీ, చేతిలో కత్తినీ చూసినా భయపడట్లేదు!!!

"అలా చూస్తావేంవిటయ్యా? ఎవరి వంటే మాట్లాడవేం?" రెట్టించింది.

"ఎవర్నా? నేనెవరో సెప్పాలా? గజదొంగ బద్రయ్య పేరెప్పుడన్నా ఇన్నావా? ఈ సుట్టుపక్కల బస్తీలన్నిటిలో నా పేరుసెప్తే పిల్లలేకాదు, పెద్దాళ్ళు కూడా పచ్చి మంచినీల్లు తాగలేరు"— మీసం మెలేస్తూ అన్నాడు.

"కట్టెల అడితి పోచమ్మని పట్టపగలు చంపి నగలు పట్టుకుపోయింది......"

"నేనే. అయితే గుర్తుపట్టావన్న మాట."

"ఆ, అది సరే. ఎవిటంటావ్ ఇప్పుడు?" చిరాగ్గా అడిగింది.

"అఁయ్. నేనెవరో తెలిసాక్కూడా నీకు బయంగా లేదా?"

"భయవాఁ? ఎందుకూ?"

"సంపేత్తానని!!" కాలుతో బలంగా నేలమీద తన్ని, ఉరిమాడు భద్రయ్య.

వెటకారంగా చూస్తూ, జీవంలేని నవ్వొకటి నవ్వింది సావిత్రి.

"ఏయ్! ఎందుకు నవ్వుతావు?"— కోపంగా పళ్ళుకొరుకుతూ అరిచాడు వాడు.

"చంపేస్తావని భయపడాలా నేను?...భలే! చావడానికి వచ్చిన దానికి చావంటే భయం ఎందుకుంటుంది?"

అయోమయంగా చూసాడు భద్రయ్య.

"ఆఁ, నేనీ వేళప్పుడు ఇక్కడికొస్తానని నీకెలా తెల్సు?"

"చద్దామనుకున్నది నీ చేతుల్లో కాదు. నీ చేతుల్లో చావడంతప్పితే ఇంక మార్గాలే లేవేమిటి? ఇంకో పదినిమిషాల్లో రైలుంది" తాపీగా అంది సావిత్రి.

అంతా అయోమయంగానే వుంది భద్రయ్యకి. నెమ్మదిగా బండరాతిమీద కూలబడ్డాడు.

"సూడ్డానికి పెద్దింటిపిల్లలాగున్నావు. సద్దావఁని ఎందుకు అనుకుంటున్నావు?" జాలి చూపిస్తూ అడిగాడు.

"ఇంట్లో బాధలు పడలేక..."

"ఏం నీ మొగుడు మంచోడుకాదా?"

"ఉఁహుఁ, కాదు. బాగా డబ్బుంది. కానీ నాకోసం కాణీ ఖర్చుపెట్టడు. పైగా ఎప్పుడూ మా పుట్టింటినుంచి డబ్బు తెమ్మని నన్ను బాధలుపెడుతుంటాడు. ప్రతిరోజూ తాగొచ్చి నన్ను కొడ్తూంటాడు. ఈరోజుకూడా తాగొచ్చి బాగా కొట్టాడు. ఉన్న లక్షల ఆస్తీ అతని తాగుడుకే సరిపోతోంది. అందుకనే బాధలు భరించలేక చద్దామని ఇలా

వచ్చాను" అని, కళ్ళు వత్తుకుంది సావిత్రి.

"మీ ఆయన దగ్గర బాగా డబ్బుందా ?" తనలోని ఆశని దాచ ప్రయత్నిస్తూ అడిగాడు భద్రయ్య.

"బోల్డుంది. ఇంటిదగ్గర బీరువాల్లోనే చాలా వుంది. కానీ తాళాలెప్పుడూ తన దగ్గరే పెట్టుకుని, నా ఆనందంకోసం పైసా విదల్చడు. పోయేటప్పుడు కూడా కట్టుకుపోగలనని అనుకుంటున్నాడు కాబోలు."

"ఇప్పుడు ఇంటికాడే వున్నాడా?"

"ఆ .తాగొచ్చి, నన్నుకొట్టి, పాపం అలిసిపోయి పడుకున్నాడు. నేనిలా వచ్చేసాను."

"సావాలనుకోవడానికి బదులు నువ్వు ఏవూరన్నా పారిపోయి, సుకంగా బతకొచ్చుగా?"

"డబ్బేదీ...?"

"నీమొగుడుకా డుందంటున్నావుగా"

"ఉంటేమాత్రం? ఆడదాన్ని-అతని దగ్గర్నుంచి తాళాలు లాక్కుని డబ్బు తీసుకుని పారిపోగల బలం నాకెక్కడిది. తన్నులే తప్పించుకోలేక చస్తూంటే..."

"నేను సాయంజేత్తాను పోనీ. మీ ఇంటిఇవరాలు అన్నీ సెప్పేవంటే-బోల్డు డబ్బు పట్టుకొచ్చేత్తాను. సగంవాటా నాకియ్యాలి, సరేనా?"

"ఓ అలాగే, కానీ ఓ షరతు. అతని ప్రాణానికి ఏ ముప్పూ రాకూడదు."

"శశ, ఒంటిమీద అసలు సెయ్యే య్యను సరా? తల్తోడు" అని తలమీద చెయ్యేట్టుకుని ఒట్టేసాడు. ఆనందంతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నాడుకూడా.

"సరే అయితే. ఇలా చూడు. బొమ్మ గీస్తున్నాను. బాగా అర్థంచేసుకో. ...ఇది హాలు...ఈ ప్రక్కది బెడ్ రూము. హాలు, రీడింగ్ రూముల తలుపులు వేసేసివున్నాయి. నువ్వు ఈ ప్రక్కగా పోయి, పెరటివైపునుంచి ఈ బెడ్‌రూములో ప్రవేశించు. నేను వచ్చేటప్పుడు ఈ తలుపు తీసుకుని వచ్చి, బయట గొళ్ళెం పెట్టాను అర్థమయిందా? ఇంక లోపలికి వెళ్ళాక బెడ్‌రూంలోంచి స్టోర్ రూంలోకి అక్కణ్ణుంచి ఒక చిన్న గదిలోకి దారుంది ఆ చిన్నగదిలో రెండు బీరువాలున్నాయి. వాటిల్లో వుంది బోలెడు డబ్బు" అని వ్రేలితో రాయిమీద బొమ్మలు గీసి చెప్పింది సావిత్రి.

"నేనొక్క అరగంటలో పని ముగించుకు నొచ్చేత్తా. నువ్విక్కడే వుండు" అని లేచాడు భద్రయ్య.

"నీకంతా తొందరే తప్పితే బుర్ర లేదు. అసలు తాళాలెక్క డుంటాయో తెలుసుకున్నావా ?" అజమాయిషీగా అంది.

"ఆఁ, అవును. మర్చిపోయా. సెప్పు."తొందరపాటుని ఒప్పుకున్నాడు.

"తాళాలుఆయనజేబులోనేవున్నాయి.

ఇప్పుడే బయటనుంచి వచ్చేడుకదా. బయటకెళ్ళేటప్పుడే జేబులో వేసుకుని పోతాడు. పైగా అతనికి ఎటువంటి అపాయం కలగనివ్వనని మాటిచ్చావు. అతనుకూడా నీలాగే బలంగావుంటాడు. ఆ మనిషి ఎంత తాగున్నా-నువ్వు ఒక్తి చేతుల్తో ఎలా సంపాదించగలవు తాళాలు?"

"అవును. అదీ నిజవేఁ. ఎప్పుడూ అడ్డొచ్చినవాళ్ళని నరికి పారెయ్యడమే గాని, సునాయాసంగా ఏదీ సెయ్యలేదు. నువ్వే సెప్పు-ఏంసెయ్యమంటావోమరి."

"మీదగ్గర మత్తుమందు రుమాళ్ళూ అవీ వుంటాయికదా?"

"ఆఁ బాగా సెప్పావు. ఈ డౌనులో నాకు తెలిసిన సాయబ్బొకడున్నాడు. ఆడిదగ్గర అన్నీ వుంటాయి. ఇప్పుడే సిటికలో అన్నీ తీసుకొత్తాను" అంటూ లేచి పరిగెట్టబోయాడు భద్రయ్య.

"ఏయ్ ఏయ్ ఆగు. నీ సంగతి బాగానేవుంది. మరి నన్ను బతకమని ఆశకలిపించావుకదా! ఈ రాత్రివేళ ఇలాంటిచోట ఒక్కర్తినీ ఎలా వుండను? ఎవడైనా పీకపిసికి చంపేస్తే?"

"మరైతే ఎట్టా? నాతో వత్తావా గూడెంలోకి?"

"అబ్బెబ్బె...రాను."

"మరైతే ఏటంటావు?"

"సరే ఇక్కడే వుంటాలే.త్వరగా రా. ఆ కత్తిలా పడెయ్యి. దగ్గరుంచుకుంటా, ఎందుకన్నా మంచిది."

కత్తి అందించి, భద్రయ్య గబగబా హుసేన్ సాగర్‌వైపు డౌన్‌లోకి దిగి పోయేడు.

చేతిలో కత్తి పదునువైపు ఒకసారి చూసి, నేలమీదరాసి పదును పెడుతూ, రైలుస్టేషన్‌వైపుచూస్తూ, "ఇంక అయిదు నిమిషాలు" అనుకుంది సావిత్రి. ఆమె గుండెలు వేగంగా కొట్టుకుంటున్నాయి. నెమ్మదిగా ఒక్కొక్కటే చెమటబిందువులు ఆమె మొహంమీద పొటమరిస్తున్నాయి. నాలిక తడారిపోతోంది. కత్తిని బాగా నూరి పదునుచూసి, తృప్తిగా నిట్టూర్చింది, సావిత్రి. స్టేషన్‌వైపు ఇంకొకసారి చూసింది. పచ్చలైటు వెలిగింది.

"మత్తుమందు, తాళ్ళు, నోట్లో కుక్కడానికి గుడ్డలూ గట్రా తెచ్చేసుకున్నా. ఇక నువ్వు మీ ఇల్లెక్కడో సెప్పడవేఁ తరవాయి" అన్నాడు భద్రయ్య పరిగెట్టుకునివచ్చి,వగురుస్తూ.

"ఇదిగో ఇలా నా ముందుకు రా. కూర్చో. బాగా వంగి ఆ సందులో రెండు చెట్లమధ్యగా చూడు. మేడ కనిపించ ట్లేదూ?"

సావిత్రిముందు మోకాళ్ళమీద కూర్చుని, ఆమె చూపించిన దిశగా కన్ను పొడుచుకు చూస్తున్నాడు, భద్రయ్య.

"చెట్లు అడ్డొస్తున్నట్లున్నాయి నీకు. బాగా వంగితేనేగానీ కనిపించదు. మనెదురుగా కనిపించే కిటికీ క్రింది గదిలోనే మా ఆయన వున్నాడు."

భద్రయ్య ఇంకా వంగాడు. కళ్లు బాగా పెద్దవి చేసుకుని చూస్తున్నాడు.

—రైలు కూత, ఝుక్ ఝుక్ మనే శబ్దం బాగా దగ్గరలో వినిపించాయి.

"అయ్యోరామ! సరిగ్గా చూడవయ్యా. ఇంక వేరేవిధంగా గుర్తులు చెప్పడానిక్కూడా లేదు. అక్కడున్నవన్నీ మేడలే. ఇదిగో—ఈ కొసకొచ్చి వంగి చూడు. బాగా కనిపిస్తుంది" అంది సావిత్రి, పెదవులు తడిచేసుకుని మొహంమీది చెమటను తుడుచుకుంటూ.

కొసకి వచ్చి, బాగా వంగి, తిన్నగా చూస్తున్నాడు భద్రయ్య.

రైలు కూత మరీ దగ్గరగా వినిపించింది.

"ఎక్కడా......" అంటూ ఏదో అనబోయిన భద్రయ్య పెద్దగా దిక్కులు పిక్కటిల్లేలాగ కేకపెట్టడం, కేకపెడుతూనే ఆ కొండరాయి మీదనుంచి దిగువలోకి రాలిపోవడం జరిగిపోయేయి.

అతని కంఠంలో బలంగా కత్తి దిగబడిపోయింది.

"చవటవెధవా ! నా సమస్యకి పరిష్కారం నువ్వెట్టా చెప్పేది! నువ్వు దొంగతనంచేసి నా యింట్లో —ఆ డబ్బుతో పారిపోయి – 'డబ్బు పట్టుకు పారిపోయింది దొంగముండ' అని నాకు చెడ్డపేరు తెప్పించడానికిట్టా? పైగా వాడ్ని మించిన దుర్మార్గుడివి నువ్వు. వాడు నా కొక్కతికే శత్రువైతే నువ్వు దేశానికే శత్రువ్వి. నువ్వు బ్రతికుండడం సమాజానికే లోటు. నీలాగే వాణ్ణీ ఏ నిద్రోతున్నప్పుడో చంపెయ్యొచ్చు. కానీ వాడు చావకూడదు. అందుకనే నా తల్లి దండ్రులకీ, తెలిసున్నవాళ్ళందరికీ నా చావుక్కారణం ఏవిటో ఈరోజే ఉత్తరాలు రాసిపడేశాను. ఊళ్లోవాళ్ళంతా 'పెళ్ళాన్ని చంపిన వెధవ' అని మొహం మీద వుమ్మేస్తూంటే వాడు ఆజన్మాంతం కుళ్ళికుళ్ళి ఏడుస్తూ బతకాలి. అదే మా సమస్యకు పరిష్కారం. చచ్చేముందు నీలాంటి దుర్మార్గపు వెధవని నాశనం చెయ్యగల అవకాశం యిచ్చినందుకు ఆ భగవంతుణ్ణి మనసారా అభినందిస్తున్నాను," అని, అతివేగంగా వస్తూన్న రైలుకి—పట్టాలమధ్యగా చేతులు చాచి నిల్చుని, ఆప్యాయంగా ఆహ్వానం పలికింది సావిత్రి.